క్లుప్తంగా

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

జిల్లా టీబీ అధికారి రవీంద్ర


మాట్లాడుతున్న రవీంద్ర

దోమ: వైద్య సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా టీబీ అధికారి రవీంద్ర పేర్కొన్నారు. మంగళవారం దోమ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ ఆసుపత్రిలో కేవలం రెండే ప్రసవాలు జరగడంతో ఆయన అసహనాన్ని వ్యక్తం చేశారు. మహిళలకు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవం చేసుకునేలా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిలర్‌కు ఆత్మీయ వీడ్కోలు


వీడ్కోలు సమావేశంలో ఆయా కాలనీలవాసులు

పరిగి: మున్సిపల్ పాలకవర్గం పదవీ కాలం ముగియడంతో మంగళవారం పట్టణ కేంద్రంలోని 4వ వార్డు కౌన్సిలర్‌కు కాలనీవాసులు ఆత్మీయ వీడ్కోలు నిర్వహించారు. కాలనీలోని విద్యావంతులు, ఉద్యోగులు, ప్రజలు హాజరయ్యారు. కౌన్సిలర్ వారాల రవీందర్ కాలనీ అభివృద్ధికి చేసిన కృషిని వారు కొనియాడారు. అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న కాలనీని ఆదర్శంగా తీర్చిదిద్దారన్నారు. భవిష్యత్తులో రాజకీయంగా దినదినాభివృద్ధి చెంది నిత్యం ప్రజా సేవలో ఉండాలని వారు ఆకాంక్షించారు. అనంతరం కౌన్సిలర్ మాట్లాడుతూ ఐదు సంవత్సరాలు సేవ చేసే భాగ్యాన్ని ప్రజా బలంతో సాధ్యమైందన్నారు.

పేదల ప్రభుత్వం కాంగ్రెస్


లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కును అందిస్తున్న నాయకులు

కుల్కచర్ల: కాంగ్రెస్ పేదల ప్రభుత్వమని చౌడాపూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎల్పాటి అశోక్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని చిన్న మేగ్యనాయక్ తండాలో లాలమ్మకు మంజూరైన రూ.58వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మెరుగైన చికిత్సల కోసం ప్రభుత్వం అందజేస్తున్న సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బడుగుబలహీనవర్గాల అభ్యున్నతికి నిర్విరామంగా కృషిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో శేఖర్, సలీం, శంకర్, రాము, విజయ్, పాండు, శ్రీను, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

మందకృష్ణకు అభినందనలు


శుభాకాంక్షలు తెలుపుతున్న ఆనంద్

అనంతగిరి: కేంద్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన పద్మశ్రీ అవార్డుల్లో ఎమ్మార్పీఎస్ అధినేత మంద కృష్ణ మాదిగకు రావడంతో వికారాబాద్ జిల్లా ఎంఎస్పీ అధ్యక్షుడు ఆనంద్ హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన హైదరాబాద్‌లోని మందకృష్ణ నివాసానికి వెళ్లి అభినందనలు తెలిపి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట జిల్లా నాయకులు సుభాష్, వీరేష్‌కుమార్, వెంకటరత్నం, జయాకర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల పునర్నిర్మాణానికి సహకారం

షాద్‌నగర్‌రూరల్: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని చిన్నచిల్కమర్రి గ్రామంలోని ప్రాథమిక పాఠశాల శిథిలావస్థకు చేరుకుంది. పాఠశాల పునర్నిర్మాణానికి పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు ముందుకొచ్చారు. పూర్వ విద్యార్థి కొత్త చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మంగళవారం పూర్వవిద్యార్థులు తమవంతు సహాయంగా రూ.3లక్షల 2వేల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు కృష్ణ మాట్లాడుతూ.. మన బడిని మనమే బాగుచేసుకోవాలనే సంకల్పంతో పూర్వ విద్యార్థులు తమవంతుగా విరాళాలను ఇవ్వడం అభినందనీయమన్నారు. మాజీ సర్పంచ్ పల్లె శ్రీనివాస్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి జగదీశ్వర్, పూర్వ విద్యార్థులు యాదగిరి, సత్యం పాల్గొన్నారు.

రాగిజావలో పురుగులు


ఉడకని టమాట చారు అన్నం చూపిస్తున్న చిన్నారులు

బషీరాబాద్: బషీరాబాద్ మండల కేంద్రంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఉదయం బ్రేక్‌లో రాగిజావ చేశారు. దీన్ని వేడినీటిలో కలిపి తయారుచేస్తున్నారు. దీంట్లో పెద్దమొత్తంలో తెల్లపురుగులు కనిపించాయి. ఈ విషయాన్ని ఉపాధ్యాయులకు చెప్పడంతో పిల్లలకోసం తయారు చేసిన రాగిజావాను పారబోశారు. ఇందులో ఏజెన్సీ వాళ్ల తప్పు లేదని, ప్రభుత్వం సరఫరా చేసిన ప్యాకెట్లలోనే పురుగులు ఉన్నాయని ఉపాధ్యాయులు స్పష్టం చేశారు.

గుడ్డు గోవిందా..

ప్రతీ విద్యార్థికి వారంలో రెండుసార్లు గుడ్లు పెట్టాలని నిబంధన ఉన్నప్పటికీ చాలా పాఠశాలల్లో అమలు కావడంలేదు. ప్రభుత్వం ఒక గుడ్డుకు రూ.5 చెల్లిస్తుంది. మార్కెట్‌లో గుడ్డు ధర ఒక్కటి రూ.7 ఉండడంతో మధ్యాహ్న భోజన ఏజెన్సీలు తమకు నష్టం వస్తుందని పిల్లలకు గుడ్లు పెట్టడంలేదు. గుడ్డుకు బదులు వారంలో మూడుసార్లు అరటి పండు అందజేస్తున్నారు.

ఉడకని టమాట చారు.. అన్నం

మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఉడికి ఉడకని టమాట చారుతో అన్నం పెట్టారు. గొడ్డుకారంతో చేసిన టమాట చారు రుచి లేదని చిన్నారులు ఆవేదన వ్యక్తం చేశారు. మెనూ ప్రకారం మంగళవారం ఉదయం రాగి జావ, మధ్యాహ్నం అన్నం, సాంబారు, మిక్సుడు కూరగాయలు వండి వడ్డడించాలి. కానీ కేవలం టమాట చారుతోనే సరిపెట్టారు.

పెట్టింది తినాల్సిందే

ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు పౌష్టికాహారంతో కూడిన భోజనం అందించేందుకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తోంది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం.. వంట ఏజెన్సీలకు గిట్టుబాటు కాకపోవడంతో పథకం నీరు గారి పోతోంది. మంగళవారం వికారాబాద్, తాండూరు, పరిగి నియోజకవర్గాల్లోని పలు పాఠశాలలను 'సాక్షి' విజిట్ చేసింది. ఉడికీ ఉడకని అన్నం.. ఒక్కటే కూరతో ఇష్టం వచ్చినట్లు వండుతున్నారు. ఈ విషయం గురించి విద్యార్థులను విచారించగా.. రుచి లేకుండా ఉంటుందని, తినలేకపోతున్నామని వారు చెబుతున్నారు.

ధారూరు: వచ్చింది పెట్టాం, అడిగితే ఏం లాభం, పెట్టింది తినాల్సిందేనని అక్షయపాత్ర నిర్వాహకులు పేర్కొనడం గమనార్హం. ఇవ్వాల్సిన గుడ్డు, ఇతర నాన్‌వెజ్ ఐటమ్స్ కూడా లేవని, అక్షయపాత్ర నిర్వాహకులు ఏం పంపిస్తే అదే తినాల్సి ఉంటుందని విద్యార్థి జగన్ ఆందోళన వ్యక్తం చేశారు. మెనూను అసలు పట్టించుకోవడం లేదని విద్యార్థి వాపోయారు.

– జగన్, ఏనిమిదోతరగతి, ధారూరు, బాలుర ఉన్నత పాఠశాల

భోజనం రుచిగా ఉంది



గతంలో దొడ్డు బియ్యం అన్నం వడ్డించేవారు. అది తినలేకపోయాం. ప్రస్తుతం సన్న బియ్యం అన్నం వడ్డిస్తున్నారు. రుచిగా ఉంటోంది. సోమవారం గుడ్డు ఇచ్చారు. సార్లు కూడా ఇక్కడే తింటున్నారు.

– పవన్ ఐదోతరగతి, ప్రాథమిక పాఠశాల, మోమిన్‌పేట

బిల్లులు మంజూరు కావడం లేదు


కుల్కచర్ల: మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు

కొడంగల్ రూరల్: మధ్యాహ్న భోజన పథకంలో వంట ఏజెన్సీ మహిళలకు మూడు నెలలుగా డబ్బులు అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏజెన్సీ మహిళలకు ప్రభుత్వం అందిస్తున్న బియ్యం తప్పితే కట్టెలతోపాటు వంటకు కావాల్సిన అన్ని సరుకులను బయట కొనుగోలు చేయాల్సిందే.

సాక్షి విజిట్

తూతూ మంత్రంగా మెనూ అమలు


ముద్దాయిపేట పాఠశాల ఆవరణలో భోజనం వండుతున్న సిబ్బంది

యాలాల: ఆయా పాఠశాలల్లో చాలా వరకు తూతూ మంత్రంగా మెనూ అమలు అవుతుంది. గుడ్లు, అరటిపండ్లు, ఇతర కూరగాయలను ఇష్టం వచ్చినట్లు వండుతున్నారు. ప్రతినెలా బిల్లులు సక్రమంగా రాకపోవడంతోనే మధ్యాహ్న భోజన నాణ్యత, మెనూను అమలు చేసే విషయంలో ఉపాధ్యాయులు గట్టిగా అడగలేకపోతున్నారు. బిల్లులు సక్రమంగా రాకపోవడంతో కిరాణ, కూరగాయల దుకాణాల యజమానులకు డబ్బులు చెల్లించలేని పరిస్థితి నెలకొంది.

ఆరు బయటే భోజనం

బొంరాస్‌పేట: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలులో సమస్యలు తీరడం లేదని విద్యార్థులు వాపోతున్నారు. ప్రహరీ బయట నుంచి మురుగు పారుతుండటంతో దుర్వాసన భరించలేకపోతున్నాం. భోజనశాల లేక ఆరుబయటే వరండాలోనే మధ్యాహ్న భోజనం తింటున్నాం. అధికారులకు, గ్రామపెద్దలకు చెప్పినా సమస్య పరిష్కరించడం లేదు.


బొంరాస్‌పేట: ఎండలోనే మధ్యాహ్న భోజనం వడ్డింపు

రేపు వినికిడి లోపగ్రస్తులకు ఉచిత వైద్య శిబిరం

తాండూరు టౌన్: వినికిడి సమస్యతో బాధపడుతున్న వారి కోసం గురువారం తాండూరు పట్టణంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు నిర్వాహకులు డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ గోపాల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. చెవులు సరిగా వినపడని, పుట్టుచెవుడు, మాటలు రాని పిల్లలకు, వయస్సుతో పాటు వినికిడి శక్తి కోల్పోయిన వారి కోసం ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఆధునిక పరికరాల సహాయంతో పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు. తాండూరు బస్టాండు ఎదురుగా అపెక్స్ ఆసుపత్రి సమీపంలోని ఆర్తి కిడ్నీ హాస్పిటల్ ఎదురుగా ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు వైద్య శిబిరం కొనసాగనుందని పేర్కొన్నారు.

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి

దోమ: సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని దోమ మండల పీఆర్టీయూ అధ్యక్షుడు ఆర్ కేశవులు పేర్కొన్నారు. మంగళవారం దోమ మండల కేంద్రంలో తహసీల్దార్ పురుశోత్తానికి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూ నిర్విరామంగా కృషిచేస్తుందన్నారు. సీపీఎస్ విధానంతో ఉపాధ్యాయుల జీవితాల్లో చీకటి అలుముకుందన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం పునర్‌ఆలోచించి ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కృష్ణయ్య, చంద్రశేఖర్ రెడ్డి, ప్రవీణ్ సింగ్, వేణుగోపాల్, వెంకట్రాములు, శ్రీనివాసులు, నర్సింలు, సతీష్‌కుమార్, యాదగిరి గౌడ్, రాంచంద్రారెడ్డి, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

రేపటినుంచి కందుల కొనుగోలు

మర్పల్లి: మర్పల్లి వ్యవసాయ మార్కెట్‌లో గురువారం నుంచి కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభించనున్నట్లు మర్పల్లి ఏఓ శ్రీకాంత్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలనుసారం రైతులకు కేంద్ర ప్రభుత్వం కల్పించిన మద్దతు ధర కల్పిస్తారని తెలిపారు. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ షెడ్‌లో సహకార సంఘం ఆధ్వర్యంలో కందుల కొనుగోళ్లను ప్రారంభించే విధంగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగించుకోవాలని ఆయన కోరారు.

ఉపాధ్యాయులు సెల్‌ఫోన్లు తీసుకెళ్లొద్దు

ఎంపీడీఓ మహేష్ బాబు, ఎంఈఓ వెంకట్


ఎంపీడీఓ మహేష్ బాబును సన్మానిస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు

దోమ: ఉపాధ్యాయులు తరగతిగదిలోకి సెల్ ఫోన్లు తీసుకెళ్లొద్దని దోమ ఎంపీడీఓ మహేష్ బాబు, ఎంఈఓ వెంకట్‌లు పేర్కొన్నారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధ్యాయులకు అపార్ ఐడీ గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి అప్‌డేటెడ్ టెక్నాలజీని ఉపయోగిస్తున్నామన్నారు. అపార్‌ఐడిలో ప్రతీ విద్యార్థి వివరాలను నమోదు చేయించాలని సూచించారు. అనంతరం జిల్లా ఉత్తమ ఎంపీడీఓగా ఎంపికైన మహేష్ బాబును అధికారులు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు శ్రీదేవి, రజిని, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

కూలిన ఇంటి పైకప్పు

కుల్కచర్ల: ఇంటి పైకప్పు కూలిన ఘటన ఘనపూర్‌లో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఎరుకలి రాములు కుటుంబీకులు కూలీ పనుల నిమిత్తం మంగళవారం అందరూ బయటకు వెళ్లారు. ఈ సమయంలో ఇంటిపైకప్పు కూలిపోయింది. దీంతో బాధితులు నిరాశ్రయులయ్యారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి తమకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరారు.

మాదక ద్రవ్యాలతో అనర్థాలు


మాట్లాడుతున్న సహదేవు

మర్పల్లి: మాదక ద్రవ్యాలు సేవించి పోలీసులకు పట్టు బడితే చట్ట పరమైన కేసులు నమోదు చేస్తామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ మోమిన్‌పేట్ మండల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సహదేవు పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ విద్యార్థులకు మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పించారు. గంజాయి, డ్రగ్స్ వాడటంతో కలిగే అనర్థాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు వాడటంతో జీవితాన్నే కోల్పోవలసి వస్తుందన్నారు. విద్యార్థులు ఉపాధ్యాయుల సలహా, సూచనలు పాటించి చదువుకోవాలన్నారు. చదువుకుంటే భవిష్యత్ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ప్రమీల, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ మర్పల్లి ఎస్ఐ రేఖ, పాఠశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద రహిత సమాజాన్ని నిర్మిద్దాం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్


బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

షాద్‌నగర్: ప్రమాద రహిత సమాజ నిర్మాణంలో అందరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పిలుపునిచ్చారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకొని ఎంవీఐ వాసు ఆధ్వర్యంలో మంగళవారం భారీ బైక్ ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాలను అరికట్టాలంటే వాహనదారుల్లో చైతన్యం రావాలన్నారు. ప్రతీ వాహనదారుడు విధిగా రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనాలపై ప్రయాణించి ప్రమాదాల బారిన పడినవారు ఎందరో ఉన్నారన్నారు. అదేవిధంగా ఇటీవల కాలంలో జరిగిన ప్రమాదాలను పరిశీలిస్తే.. మద్యం సేవించి వాహనాలు నడిపి ప్రమాదాలు జరిగిన ఘటనలే అధికంగా ఉన్నాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాల నివారణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ట్రాన్స్‌పోర్టు శాఖ డిప్యూటీ కమిషనర్ సదానందం మాట్లాడుతూ.. ప్రమాదాల నివారణకు రోడ్డు రవాణాశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టి ప్రజలను చైతన్యం చేస్తున్నట్లు తెలిపారు. లైసెన్సులు లేకుండా, వాహనదాల ధ్రువపత్రాలు లేకుండా ఎవరూ వాహనాలు నడిపించొద్దన్నారు. సామర్థ్యానికి మంచి అధికంగా ప్రయాణికులను వాహనాల్లో ఎక్కించుకోవద్దన్నారు. ప్రమాదరహిత సమాజ నిర్మాణానికి అందరూ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏసీపీ రంగస్వామి, ట్రాఫిక్ సీఐ చంద్రశేఖర్, పట్టణ సీఐ విజయ్‌కుమార్, ఎస్ఐ బలరాం, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, నాయకులు చల్లా శ్రీకాంత్‌రెడ్డి, సయ్యద్ సాధిక్, రఘునాయక్, బస్వం, ఇబ్రహీం, బాల్‌రాజ్, రవికుమార్, తుపాకుల శేఖర్, రాయికల్ శ్రీను, సీతారాం, అశోక్, విజయేందర్, లక్ష్మణ్, శంకర్, వాసు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు


అప్పోజీగూడ సమీపంలో కంకరతో తాత్కాలికంగా పూడ్చిన గుంతలు

మొయినాబాద్: ఒకప్పుడు ముఖ్యమంత్రి ఏ ఊరికైనా వస్తున్నారంటే ఆ ఊరి రోడ్లు వెంటనే బాగుపడేవి. సీఎం వెళ్లే రూట్‌లో రోడ్లు గుంతమయంగా ఉంటే బీటీ వేసేవారు. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ముఖ్యమంత్రి వెళ్లే రోడ్డు కూడా గుంతలమయంగానే ఉంటుంది. ఎక్కువ గుంతలు ఉన్నచోట అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేసి చేతులు దులుపుకుంటున్నారు. మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి పొద్దటూరు రెవెన్యూలో ఏర్పాటు చేసిన ఎక్స్‌పీరియం పార్కు ప్రారంభోత్సవానికి మొయినాబాద్‌లోని చిలుకూరు రోడ్డులో వెళ్లారు. అయితే చిలుకూరు నుంచి వీరన్నపేట వరకు రోడ్డు అక్కడక్కడా పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి అధ్వానంగా మారింది. సీఎం వస్తున్నారని నాలుగురోజుల నుంచి ప్రచారం జరుగుతున్నా అధికారులు రోడ్డు పరిస్థితిని పట్టించుకోలేదు. సీఎం రాకతో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి అధికారులు ఉరుకులు పరుగులు పెట్టి రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేయించారు. రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో కంకర పోసి నింపారు. అధికారులు హడావిడిగా చేసిన తాత్కాలిక మరమ్మతులపై స్థానికులు చర్చించుకుంటున్నారు. గుంతల్లో పోసిన కంకర రోడ్డుపైకి వచ్చి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాపోతున్నారు.

యాదవ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

దుద్యాల్: అఖిల భారత యాదవ సంఘం క్యాలెండర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు జింకల యాదయ్య యాదవ్ మాట్లాడుతూ కొన్నేళ్లుగా యాదవుల సమస్యలపై అలుపెరగని పోరాటం చేస్తున్నామన్నారు. అనంతరం దుద్యాల్ మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నర్సిములు యాదవ్, ఉపాధ్యక్షుడిగా ప్రభాకర్ యాదవ్, ప్రధాన కార్యదర్శిగా వెంకటయ్య యాదవ్, కార్యదర్శులు గోపాల్, కాశప్ప, రాంచందర్‌లతో పాటు ఇతర కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు రాఘవేందర్, ఫకీరప్ప, వెంకటేశ్, నర్సిములు, యాదగిరి పటేల్, బస్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు

తాండూరు రూరల్: తాండూరు మండలంలోని ఆయా గ్రామాలకు పంచాయతీ రాజ్ శాఖ నుంచి రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఉత్తమ్‌చందు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జినుగుర్తి నుంచి సంకిరెడ్డిపల్లి వరకు రూ.1 కోటి, సంకిరెడ్డిపల్లి నుంచి దారువాగు తండాకు రూ.50 లక్షలు, పీడబ్ల్యూడీ నుంచి బిజ్వార్ గ్రామం వరకు రూ.61లక్షలు, పీడబ్ల్యూడీ నుంచి గోనూర్ వరకు రూ.71లక్షలు, హన్మపూర్ రోడ్డు నుంచి వయా జయరాంతండా మీదుగా సంకిరెడ్డిపల్లి వరకు రూ.2కోట్లు మంజూరయ్యాయని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలి

కొందుర్గు: సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పద్ధతిలో పెన్షన్ విధానం అమలు చేయాలని పీఆర్టీయూ టీఎస్ సంఘం సభ్యుడు మంగళవారం తహసీల్దార్ రమేష్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. సీపీఎస్ విధానంతో ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారని వాపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రాజస్థాన్, చత్తీస్‌ఘడ్, జార్ఖండ్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో పాత పెన్షన్ విధానాన్ని అమలులోకి తీసుకొచ్చారని, తెలంగాణలోనూ అమలు చేయాలని వారు కోరారు.

సమస్యల పరిష్కారానికి కృషి

పరిగి: గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు రత్నం పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని నస్కల్ గ్రామంలో రూ. 5లక్షల ఎమ్మెల్యే నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల ప్రకారం సంవత్సరంలోనే ఆరు గ్యారంటీలను అమలు చేసిన ఘటన సీఎం రేవంత్‌రెడ్డికి దక్కుతుందన్నారు. స్థానిక ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి చొరవతో గ్రామాల్లోని సమస్యలన్నింటినీ దశలవారీగా పరిష్కరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీధర్, ఉపాధ్యక్షుడు ప్రేమ్, వెంకటయ్య, మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

బషీరాబాద్ అభివృద్ధికి నిధులు మంజూరు

బషీరాబాద్: బషీరాబాద్ మండల అభివృద్ధికి రూ.300 కోట్ల నిధులు మంజూరయ్యాయని మార్కెట్ కమిటీ చైర్మన్ మాధవరెడ్డి పేర్కొన్నారు. తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి వెనుకబడిన మండలానికి నిధుల వరద పారిస్తున్నారని కొనియాడారు. మంగళవారం జీవన్గీ గ్రామంలో రూ.15లక్షల నిధులతో సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. లక్ష్మీనారాయణపూర్ చౌరస్తా నుంచి మైల్వార్ వరకు 4లేన్ల ఆర్‌అండ్‌బీ రోడ్డుకు రూ.150 కోట్లు, బషీరాబాద్ నుంచి జీవన్గీ వరకు రూ.30 కోట్లతో ఆర్‌అండ్‌బీ రోడ్డు, రూ.15 కోట్లతో పంచాయతీ రాజ్ రోడ్లు, బషీరాబాద్–కొత్లాపూర్ రోడ్డుకు రూ.3.25 కోట్లు, మైల్వార్–కంసాన్‌పల్లికి రూ.50లక్షలు, మంతన్‌గౌడ్ రోడ్డుకు రూ.58 లక్షలు, ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణానికి రూ.10 కోట్లు, రూ.5 కోట్లతో గ్రామాల్లో సీసీ రోడ్లు, మంతట్టిలో రూ.20 లక్షలతో జీపీ భవనానికి నిధులు మంజూరు చేశారన్నారు. కొన్ని పనులు ఇప్పటికే ప్రారంభం కాగా, మరికొన్ని టెండర్ ప్రాసెస్‌లో ఉన్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రాములు, మాణిక్‌రెడ్డి, చంద్‌రశేఖర్, దేశ్‌ముఖ్ సంగారెడ్డి, జి.నర్సిరెడ్డి, వడ్ల నాగప్ప, రామని అంజిలప్ప తదితరులు పాల్గొన్నారు.


పరిగి: సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు


బషీరాబాద్: పనులు ప్రారంభిస్తున్న మార్కెట్ చైర్మన్ మాధవరెడ్డి తదితరులు